క్లుప్తంగా

ఇస్లామి హింద్ అధ్యక్షుడిగా అహ్మద్ అన్సర్



బాధ్యతలు స్వీకరిస్తున్న అహ్మద్ అన్సర్

సీటీఆర్‌ఐ: జమాత్–ఎ– ఇస్లామి హింద్ నగర అధ్యక్షుడిగా షేక్ అహ్మద్ అన్సర్ నియమితుల య్యారు. 2030–25కు జరిగిన ఎన్నికల్లో నగర యూనిట్ అధ్యక్షుడిగా ఆయన ఎన్నికయ్యారు. కోవిడ్ సమయంలో సేవలు, రంజాన్ కిట్ల పంపిణీ, మహిళా విభాగం ఏర్పాటు, సద్భావన మంచ్ ఏర్పాటు, మత సామరస్యానికి ప్రతీకగా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. స్థానిక అంటికోట మస్జిద్‌లో జమాతె ఇస్లామి హింద్ సభ్యుల సమక్షంలో అన్సర్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సలహా మండలి సభ్యులు హిమాయత్, ముస్తఫా షరీఫ్, జమీర్, ఇమ్రాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

12న విత్తన మహోత్సవం

ప్రకాశంనగర్: వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న గుంటూరులోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం లా ఫారంలో విత్తన మహోత్సవం (మెగా సీడ్ మేళా)ను నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని శనివారం ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విత్తన మహోత్సవంలో వివిధ పంటలకు చెందిన మేలు రకాల విత్తనాల ప్రదర్శన, విక్రయాలు జరుగుతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ధవళేశ్వరం: స్థానిక కాశీ అన్నపూర్ణేశ్వరి దేవి, గణపతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం జరిగింది. డాక్టర్ రవిరామ్‌కిరణ్ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండిబోయిన నాగరాజు, రామబ్రహ్మం, తలారి మూర్తి, వెలుగుబంటి ప్రసాద్, ఆళ్ల ఆనందరావు, నీలి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ధనుంజయ్ సేవలు చిరస్మరణీయం



ధనుంజయ్ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి గణేష్ తదితరులు

కడియం: రాష్ట్ర అటవీ బోర్డు మాజీ డైరెక్టర్ కాగిత ధనుంజయ్ సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. ధనుంజయ్ కుమార్తె, మాజీ ఎంపీపీ సత్యభారతి ఆధ్వర్యంలో వేమగిరిలో జరిగిన ధనుంజయ్ జయంతి కార్యక్రమంలో గణేష్ పాల్గొని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ధనుంజయ్ సేవలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దాల తిరుపతిరావు, పార్టీ నాయకులు ముత్యాల పోసికుమార్, మాజీ సర్పంచ్‌లు వెలుగుబంటి వెంకటాచలం, గుత్తుల హరిప్రసాద్, పీసీసీ మాజీ సభ్యుడు కాగిత రాయప్ప పాల్గొన్నారు.

న్యాక్‌లో స్వచ్ఛ భారత్



న్యాక్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న స్కిల్ హబ్ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్(న్యాక్)లోని స్కిల్ హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జూన్ భాగిదరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించామన్నారు. స్కిల్‌హబ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు న్యాక్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జె.రాజు, న్యాక్ ఇన్‌చార్జి జయలక్ష్మి, శిక్షణ సిబ్బంది రాజ్ కుమార్, గోపాల్, రాజా కాలెబ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు కనూరి సతీష్‌బాబు అన్నారు. ఈ నెల 5న ప్రపంచం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలో సీతంపేట గ్రంథాలయం నుంచి ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

నాడు అసాధ్యం.. నేడు సుసేద్యం

- సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు
- రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు
- రైతులకు కొండంత అండ

సాగులో గత టీడీపీ కష్టాలు, కన్నీళ్లు మిగిల్చింది.. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించింది.. ఈ సమయంలో వచ్చిన వైఎస్సార్ సీపీ సాగులో సిరులు కురిపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు నాలుగేళ్లుగా రైతు సంక్షేమానికి బాటలు వేసింది. తద్వారా వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది.. సాగు బంగారమైంది.. వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతుల భరోసా పథకాలు కొండంత ఆసరా అయ్యాయి.. ఒకప్పుడు ఏ చిన్న పనికైనా మండల కేంద్రాలకు పరుగులు పెట్టిన పుడమి పుత్రులు నేడు ముంగిటకే వచ్చిన రైతు భరోసా కేంద్రాలతో అన్ని సేవలూ సకాలంలో పొందుతున్నారు.



రాజవోలు ఆర్బీకే వద్ద రైతులకు విత్తనాలు అందిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)



రాజమహేంద్రవరంలో వైఎస్సార్ యంత్ర పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. నాలుగేళ్ల నుంచి అన్నదాతకు అండగా నిలుస్తోంది. సాగుకు పెట్టుబడి సాయం అందిస్తోంది. సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తోంది. ఊరి ఊరికో రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి విత్తనం నుంచి పంట కొనుగోలు వరకూ ఆసరాగా నిలుస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 12,80 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉంది. మొత్తం మంది 4,810 రైతులు ఉన్నారు. వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం కింద ఇప్పటికే నాలుగు విడతల్లో మండలంలో రైతులకు రూ.845.84 లక్షలను పెట్టుబడి సాయంగా అందించారు. 2019–20 సంవత్సరంలో 2,172 మంది రైతులకు మొదటి విడతలో రూ.48.19 లక్షలు, 2020–21లో 2,138 మందికి రూ.288.63 లక్షలు, 2021–22లో 2,391 మందికి రూ.322.78 లక్షలు, 2022–23లో 1,963 మందికి రూ.186.24 లక్షలు పంపిణీ చేశారు. అలాగే రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం మెగా మేళాలో భాగంగా మొదట విడతలో ఏడు సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, యంత్ర పరికరాలకు గాను రైతులకు రూ.23,15,167 రాయితీ కింద అందించారు. రెండో విడతలో 5 సీహెచ్‌సీ గ్రూపులకు 5 ట్రాక్టర్లు, యంత్ర పరికరాలకు గాను రైతులకు రూ.6.64 లక్షల రాయితీ అందజేశారు.

ఊరి ఊరికో 'భరోసా'

గత టీడీపీ హయాంలో ఏ చిన్న పనికైనా మండల కేంద్రాలకు పరుగులు తియ్యాల్సి వచ్చేది. నేడు ఏర్పాటైన రైతు భరోసా కేంద్రాలతో పుడమి పుత్రులకు సేవలు దరిచేరాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 18 ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా విత్తు నుంచి ధాన్యం విక్రయించే వరకూ అండగా ఉంటున్నారు. సాగులో సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ఈ–క్రాప్ నమోదు, పంట నష్టం వస్తే వెంటనే అంచనా వేసి ఇన్‌పుట్ రాయితీ అందేలా చర్యలు చేపడుతున్నారు. ఇందులో సిబ్బంది రైతులకు అవసరమైన వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించడం, పంటల బీమా వంటివి చేపడుతున్నారు. పశువులకు వైద్య సహాయం అందించడం, పశు బీమా అమలు, వాటికి కావలసిన సంపూర్ణ దాణాకు సంబంధించిన విత్తనాలను సరఫరా చేయడంలోనూ ఆర్బీకేలు విశేష సేవలందిస్తున్నాయి.

మాట నిలబెట్టుకున్నారు



ప్రజాసంకల్ప యాత్రలో రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని జగనన్న చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగేళ్ల పాటు అందించారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే అందజేస్తున్నారు. రైతుల కష్టాలు తెలుసుకుని సాగు ఖర్చులకు సాయం అందిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద అందిస్తున్న రూ.13,500 పెట్టుబడి సాయం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– పేట జగదీష్, రైతు, రాజవోలు

రుణపడి ఉంటాం..



మా గ్రూపునకు రూ.26 లక్షలతో వరికోత యంత్రం 40 శాతం రాయితీపై ఇచ్చారు. గ్రూపులో సభ్యుల పొలాల్లో వరి కోతల తరువాత, గ్రామంలోని చిన్న, సన్నకారు రైతులకు చెందిన పొలాల్లో తక్కువ ఖర్చుతో వరి కోతలు కోస్తున్నాం. సీహెచ్‌సీల ఏర్పాటుతో సాగులో యాంత్రీకరణ వినియోగం పెరిగింది. రైతులకు అవసరమైన యంత్ర పరికరాలు ఇస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– గద్దే సుబ్బారావు, రాజన్న సీహెచ్‌సీ గ్రూపు రైతు, తొర్రేడు

చిన్నారుల్లో రక్తహీనత నివారిద్దాం

ప్రకాశంనగర్: బంగారు కొండ కార్యక్రమంతో చిన్నారుల్లో రక్తహీనత నివారించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. శనివారం రాత్రి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో అలాంటి పిల్లల సంరక్షణ కోసం కలెక్టర్ మాధవీలత ఆదేశాలతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఆరు నెలల పాటు ఆ పిల్లల సంరక్షణ కోసం మెనూ రూపొందించామని, ఇందుకు నెలకు రూ.500 చొప్పున రూ.3 వేలను సహాయంగా అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1,307 మంది ఆ కేటాగిరీలో ఉన్న పిల్లలు గుర్తించామని, సచివాలయాల వారీగా వారి వ్యక్తిగత సంరక్షణ బాధ్యత తీసుకుంటారన్నారు.

క్రీడలతో స్నేహభావం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: క్రీడలతో యువతలో స్నేహభావం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. సంగిత సత్యనారాయణ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమం శనివారం రాత్రి మాధవరాయుడు పంచాయతీ పరిధి చైతన్యనగర్ కాలనీలో జరిగింది. దీనికి చందన ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించి, మెమెంటో, రూ. 50 వేల బహుమతి అందజేశారు. టోర్నీ నిర్వాహకులను అభినందించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మాజీ సర్పంచ్ వెలుగుబంటి వెంకటాచలం, నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, బోడపాటి మూర్తి, కొత్తపల్లి శివాజీ, శాకా పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

చందన ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



చందన చేయూత ట్రస్టు ద్వారా భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని చందన చేయూత ట్రస్ట్ ద్వారా పేదల ఆకలి తీరుస్తున్న వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌ను రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అభినందించారు. శనివారం కాతేరు మల్లయ్యపేటలో చందన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో సంచార వాహనం ద్వారా పేదలకు అన్నదానం చేశారు. దీనిని అటు వైపు వెళ్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చూసి అక్కడ ఆగి పేదలకు భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వినూత్న ఆలోచనతో రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తన నియోజకవర్గ పరిధిలో పేదల ఆకలి తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కేవలం నిర్ణీత ప్రదేశంలోనే కాకుండా సంచార వాహనం ఏర్పాటు చేసి తద్వారా వారంలోని ఏడు రోజులూ జనసంచారం ఉండే కూడళ్లలో అన్నదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. రోజూ ఉదయం 11:30 గంటల నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని, రెండు కూరలతో పాటు పప్పు, సాంబారు, పచ్చడి, మజ్జిగ వంటివి భోజనంలో అందజేస్తున్నామని ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యే రాజాకు తెలిపారు. నిర్విరామంగా చందన నాగేశ్వర్ చేపడుతున్న ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని రాజా అన్నారు.

సుందరంగా దానవాయిపేట పార్కు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్



పార్కు మాస్టర్ ప్లాన్ పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక దానవాయిపేటలోని నగరపాలక సంస్థ గాంధీ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీ మార్గాని భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్ ప్రకటించారు. శనివారం ఈ మేరకు సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్‌పై ఎంపీ, కమిషనర్లు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగరంలోని పార్కులను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రధానంగా పిల్లలు, యువత, మహిళలు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. మున్సిపల్ అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్ అత్యద్భుతంగా ఉందని, నిజంగా అలానే అభివృద్ధి చేస్తే నగరంలో దానవాయిపేట పార్కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందన్నారు. ముఖ ద్వారం ఫ్రేమ్ ఆకృతి నగర వాసులను తప్పనిసరిగా ఆకట్టుకుంటుందని, అదే విధంగా పార్కులో కూర్చునే ప్రాంతాలను వివిధ ఆకృతులతో అందంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్దబోతున్నట్టు తెలిపారు. త్వరితగతిన పనులు ప్రారంభించి, సాధ్యమైనంత త్వరగా నగరవాసులకు అందుబాటులోకి తేవాలని అన్నారు. ఈ పార్కు అభివృద్ధితో ప్రజలు ఆహ్లాదకరంగా, సంతోషంగా గడపవచ్చన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, ఈఈ శేషగిరిరావు, ఏఈలు, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, గుర్రం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి



వేసవి శిబిరంలో పతకాలు అందుకున్న విద్యార్థులతో హెడ్ కోచ్ హరినాథరెడ్డి

ప్రకాశంనగర్: వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలతో క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలని ఆర్ట్స్ కళాశాలలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సబ్ సెంటర్ హెడ్ కోచ్ జీరి హరినాథరెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో అండర్–12, 14, 16 విభాగాల నుంచి క్రికెట్‌లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ తదితర అంశాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హరినాథరెడ్డి మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరానికి 150 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అసిస్టెంట్ కోచ్‌లు కృష్ణారావు, బుజ్జి, సీనియర్ ప్లేయర్లు శ్రావణ్, మహేష్, విజయ్ తదితరుల సహకారంతో శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ విద్యార్థులు రాణించాలని సూచించారు. రెగ్యులర్ కోచింగ్ 12వ తేదీ నుంచి యథావిధిగా జరుగుతుందని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: పునాది స్థాయికి వచ్చిన ఇళ్ల నిర్మాణాలను ఈ నెల 30 తేదీ నాటికి పూర్తి చేయాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం వెలుగుబంద జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన, ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు, కాంట్రాక్టర్లను సమన్వయం చేసి ఎప్పటికప్పుడు వారికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించేలా చూడాలని ఎమినిటీస్ సెక్రటరీలకు తెలిపారు. పునాదులు కూడా వేయని లబ్ధిదారులుంటే ఇళ్ల నిర్మాణం ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. రెండో దశ ఇళ్ల నిర్మాణాలకు ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు. ఇందులో రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా, లైటింగ్ తదితర అంశాలు ఉండాలన్నారు. కానవరం జగనన్న కాలనీలో పూర్తిస్థాయిలో వసతులకు అంచనాలు తయారు చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



కాతేరులో నీటి ట్యాంకును ప్రారంభించి నీళ్ల బిందెను మహిళకు అందిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కాతేరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తామని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం కాతేరు గ్రామ సచివాలయం–5 పరిధి మల్లయ్యపేట ఇండస్ట్రియల్ కాలనీలో రూ.1.50 లక్షలతో నిర్మిస్తున్న బోరు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కాతేరు గోదావరి గట్టు వద్ద నివసిస్తున్న మత్స్యకార కుటుంబాలకు మంచినీటి ఎద్దడి లేకుండా చందన కృషితో ఏర్పాటు చేసిన వెయ్యి లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. కాతేరు గోదావరి గట్టు, దేవాంగ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును చందన నాగేశ్వర్ ప్రారంభించారు. స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఇంజినీర్ సంపత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, పార్టీ నాయకులు ఆచంట కల్యాణ్, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, మానుకొండ వెంకటరావు, మద్దాల దుర్గారావు, ధనరాజు, ప్రసాద్, నాని, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని వివరించండి



ఖాదర్ బాషా చేతుల మీదుగా కార్యాచరణ ప్రతులను అందుకుంటున్న ఆరీఫ్

ప్రకాశంనగర్: నాలుగేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి మైనార్టీ కుటుంబానికి అందిన సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సూచించినట్లు పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. ఈ మేరకు విజయవాడలోని ముసాఫిర్ ఖానాలో జరిగిన 'హర్ దిల్ మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్' వర్క్ షాప్‌లో తాను పాల్గొన్నానన్నారు. డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు వి.ఖాదర్ బాషాల చేతుల మీదుగా కార్యచరణ ప్రతులను అందుకున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.

విద్యుత్ సరఫరా వేళల మార్పు

కడియం: లోడ్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలను మార్పు చేసినట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు, తిరిగి ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇస్తారన్నారు. ఈ విషయాన్ని వేమగిరి, వెంకాయమ్మపేట, కడియం, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, కడియపుసావరం, జేగురుపాడు గోదావరి గట్టు ప్రాంత రైతులు గమనించాలని వారు కోరారు.

నిరాశ్రయులకు ఆసరా



వృద్ధులకు చెప్పులు పంపిణీ చేస్తున్న గోపాలకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ వృద్ధులు, నిరాశ్రయులకు ఆసరాగా నిలుస్తుందని సీఐడీ అదనపు ఎస్పీ వి.గోపాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో వృద్ధులు, నిరాశ్రయులకు చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ అవసరాలు తీర్చేవారు కొద్ది మందే ఉంటారని, అలాంటి వారిలో స్వర్ణాంధ్ర రాంబాబు అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం సుమారు 30 వేల విలువైన చెప్పులను అందజేశారు. స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ, సిబ్బంది శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



విద్యార్థులకు సైకిల్ వ్యాయామంపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

కడియం: సైకిల్ తొక్కడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆరోగ్య శాఖ సిబ్బంది లక్ష్మి, చిన్నమ్మ, ప్రవల్లిక తెలిపారు. స్థానిక లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సైకిల్ ద్వారా ఏ విధంగా వ్యాయామం చేయవచ్చో వివరించారు. అలాగే యోగాపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌లు వివిధ అంశాలను తెలిపారు. లైబ్రేరియన్ శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

తెలుగు కీర్తి పురస్కారం ప్రదానం

ప్రకాశంనగర్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని పుడమి సాహితీ వేదిక, ఫిలాంత్రోఫిక్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో విభిన్న రంగాల్లోని ప్రతిభావంతులకు తెలుగు కీర్తి పురస్కారాలను అందించారు. రాజమంహేంద్రవరానికి చెందిన జీఎస్‌జే మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు సీహెచ్ సతీష్‌కుమార్ చేస్తున్న సామాజిక కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్లు శనివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మజ్జిగ వితరణ

రాజమహేంద్రవరం సిటీ: పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని నగరంలో మజ్జిగ వితరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్, నగర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి సూచనతో నగరంలో పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చర్యలు చేపట్టామన్నారు. ఐదుబళ్ల మార్కెట్, కోటిపల్లి బస్టాండ్, స్టేడియం రోడ్, తాడితోట, షెల్టన్ సెంటర్, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, మోరంపూడి, లాలాచెరువు జంక్షన్లు తదితర చోట్ల మజ్జిగ వితరణ చేశామని అన్నారు. బాలమురళీకృష్ణ, వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ప్రకాశంనగర్: ఒడిశా రైలు ప్రమాద మృతులకు శనివారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రి జూనియర్, డిగ్రీ పీజీ కళాశాల విద్యార్థినులు నివాళి అర్పించారు. ప్రమాద మృతులకు కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య మాట్లాడుతూ భారత దేశ రైల్వే చరిత్రలో ఈ ఘటన అతి పెద్ద తప్పిదమన్నారు.

రేపటి నుంచి అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

రాజమహేంద్రవరం రూరల్: అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 17 వరకూ నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం బొమ్మూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలున్న ప్రతి ఇంటిని ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు దర్శించి ఓఆర్ఎస్, జింక్ మాత్రలు సరఫరా చేస్తారన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎన్.రాజకుమారి మాట్లాడుతూ విరోచనాల నివారణలో ఓఆర్ఎస్, జింక్ మాత్రలు సమర్థవంతంగా పనిచేస్తాయన్నారు. ఎంపీహెచ్ఈవోలు బాపిరాజు, వెంకటేశ్వరరావు, సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.